

# ఎలిజీలు

## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన అశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

### (సో) "మంచివారు"



యూనివర్సిటీ చదువు తొలి రోజుల్లోనే నాటక రంగంతో నా జీవితం ముడిపడింది. ఆ రోజుల్లో నన్ను బాగా ఆకర్షించిన సరసమైన నాటికల్లో 'రిహార్సల్స్' ఒకటి. అందులో నాది విశ్వామిత్రుడు పాత్ర. రచయితకి నాటక రంగం మీద ఎంత అనుభవం ఉందో, అంతేకాక నాటకానుభవంలో ఎదురయ్యే అవకతవకలకు రచయితకి ఎంత చక్కగా నవ్వుకునే, నవ్వించే మనస్తత్వం ఉందో చెప్పే ఫార్స్ రిహార్సల్స్. ఎన్నిసార్లు ప్రదర్శించానో చెప్పలేను. ప్రదర్శించినందుకు, ప్రదర్శిస్తున్నంతసేపూ ఎంతో ఉత్సాహాన్నిచ్చే చక్కని రచన అది. రచయిత పేరు ఆ రోజుల్లో నాకు కొత్త. నా అనుభవంతోపాటు ఆ రచయితతో దగ్గరవుతూ వచ్చాను. ఆయన ఎంత ఎత్తయిన మనిషో గ్రహిస్తూ వచ్చాను. మూడునెలల క్రితం 83 ఏళ్ళ వృద్ధుడైన ఆయన్ని కలిశాను. మనస్సులో ఉన్న ఉత్సాహాన్ని భరించే శక్తి శరీరానికి లేదే అని వాపోయారాయన. స్వాతంత్ర్యానంతర ఔత్సాహిక నాటక రంగాన్ని పరిపుష్టం చేసిన రచయితల జాబితాలో ఆయన పేరు తప్పనిసరిగా ముందుంటుంది. ఆయన సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు.

బొంబాయి వెళ్ళిన ఏ కళాకారుడికయినా ఆయన ఆత్మబంధువు. ఓ రోజు మద్రాసులో నా ఫోన్ మోగింది. "నా పేరు యజ్ఞన్నశాస్త్రి. మీకు ఖాళీ ఉంటే వచ్చి మీ దర్శనం చేసుకుంటాను" అన్నారు. నాలుగేళ్ళ కిందట. నేను కదిలిపోయాను. ఆయన నా తరానికి కులపెద్ద. అయ్యో రండన్నాను. అప్పుడు మా ఇంట్లో పద్మభూషణ్ శ్రీపాద పినాకపాణిగారన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో పాణిగారికి శాస్త్రిగారు సీనియర్. వారి అన్నగారు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి సహాధ్యాయి. ఇద్దరూ యూనివర్సిటీ అనుభవాలు మాట్లాడుకుంటుంటే నాకు ముచ్చటయిన ఫ్లాష్‌బ్యాక్ కనిపించింది. ఆయన తన పుస్తకాలు ఇచ్చి ఇంకేం కోరలేదు "తప్పక చదవండి.

చదివి మీ అభిప్రాయం వ్రాయండి" అన్నారు. ఈ తరం రచయితల్లో అంత హ్యూమిలిటీ కనిపిస్తుందా? బుద్ధిగా చదివి, శ్రద్ధగా ఉత్తరం రాశాను.

ఆయన 'మహానుభావులు' నాటకం విశాఖపట్నంలో రెండు మూడుసార్లు వేశాను. నికోలాయ్ గొగోల్ 'ఇన్స్పెక్టర్ జనరల్'కి ఇది మూడో అనువాదం. బెల్లంకొండ, రెంటాల అనువాదాలు ఇంతకన్నా మెరుగయినవి.

అయితే శాస్త్రిగారి రచనల్లో నుడికారం, ఆత్మీయత ఎక్కువ. ఆయన భాష పలకరిస్తుంది. ఆయన రచనలు చదువుతుంటే ఆయన రచనలు చేస్తున్నందుకే ఆనందపడిపోతున్న సత్యం తెలుస్తుంది. అది అక్షరాలా నిజం.

బొంబాయిలో మూడు నెలల క్రితం 'ప్రజావేదిక' కార్యక్రమానికి వెళ్ళాను. సోమంచి యజ్ఞన్న శాస్త్రిగారిని గురించి చాలామందిని అడిగాను. ఆ కార్యక్రమం రోజున ఒకాయన వచ్చి "నేను యజ్ఞన్నశాస్త్రిగారి అబ్బాయిని" అని పరిచయం చేసుకున్నారు. మర్నాడు ఫోన్, "మీ కార్యక్రమం అని తెలీదు. ఆరోగ్యం బాగోలేదు. లేకపోతే మిమ్మల్ని చూడడానికైనా వచ్చేవాడిని" అన్నారు. నేను చలించిపోయాను. "అయ్యో, మిమ్మల్ని చూడడానికి నేనే వస్తాను" అంటూ మా ఆవిడని తీసుకుని వెళ్ళాను వెదుక్కుని. ఇల్లు గుర్తుపట్టాను.

ఒక నౌకరు తలుపు తీశారు. శాస్త్రిగారిని చూసి నిర్ఘాంతపోయాను. పోలిక పట్టలేనంత చిక్కిపోయారు. అనారోగ్యం తెలుస్తోంది. ఆయన భార్య ఇంట్లోనే పడ్డారు. కాలు విరిగింది. అతుక్కుంది కానీ, నడవడానికి ధైర్యం లేదు. ఆమె మంచం మీద ఉంది. ఇద్దరూ ఇంట్లో ఉన్నారు. కొడుకూ, కోడలు ఉద్యోగానికి వెళ్ళారు.

"నాకంతా ఉన్నారు. కానీ ఇలా ఒంటరిగా బ్రతకడం అలవాటయిపోయింది." అని వాపోయారు.

"ఆరునెలల క్రిందటి వరకు ఈ నౌకరు ఒక్కడే కదా, నేను హఠాత్తుగా పోతే ఏమవుతుంది? అని బెంగపడేవాడిని, తరువాత అనిపించింది. పోయాక నాకు సమస్యేమిటి? ఉన్నవాళ్ళకి కదా బాధ అని సరిపెట్టుకున్నాను" అన్నారు నవ్వుతూ. అప్పటికి కష్టపడి వెదికి రెండు నాటకాలు ఇచ్చారు. నేను వచ్చినందుకు పొంగిపోయారు. "ఏవేవో చేయాలని ఉంది - కానీ ఓపికలేదు" అని బాధపడ్డారు. "సరస్వతీ" అని పిలిచి భార్యని పరిచయం చేశారు. ఆమె పుస్తకాల్లో చూసిన నన్ను గుర్తుపట్టి ఆనందించారు.

"ఈ మాటు మద్రసు వస్తే తమ దర్శనం చేసుకుంటాను" అంటూ గుమ్మందకా వచ్చారు. నిన్ననే ఆయన పోయిన వార్త పేపర్లో చదివి ఆ ఇల్లూ, నౌకరూ ఆయన మాటలూ గుర్తుకొచ్చాయి. పోయినప్పుడు ఆయన దగ్గర ఎవరయినా ఉన్నారో లేదో?

సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు తెలుగువారు గర్వించదగ్గ తెలుగువాడు. కొందరు దేశానికి అవసరం. కొందరి రచనలు జాతికి అవసరం. కాని రచన చెయ్యడం శాస్త్రిగారికి అవసరం. వ్రాయడంలో, వ్రాస్తున్న విషయంలో, ఆ వ్యాసంగంలో ఆయనెంతటి పరిపూర్ణమైన ఆహ్లాదాన్ని పొందుతున్నారో ఆయన చివరి రోజుల్లో రచనలు చెప్తాయి.

ఆయన్ని చూశాక వృద్ధాప్యం నన్ను భయపెట్టింది. అయితే చచ్చిపోకముందే చావుని జయించి బ్రతికినంత కాలం సాహిత్యంతో జీవితాన్ని అలంకరించుకున్న ధన్యులు. పెరిగిన కొద్దీ వొంగిన అతి గంభీరమైన వ్యక్తి సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు.

ఆ మధ్య శాస్త్రిగారి అబ్బాయి ప్రకాశరావుగారితో ఫోనులో మాట్లాడుతూ యధాలాపంగా "మీ అమ్మగారు బాగున్నారా?" అన్నాను.

అప్పుడు చెప్పాడు "కథల్లో చదువుతారో, నవలల్లో రాస్తారో సతీ సహగమనం గురించి, మా నాన్నగారు పోయాక మా అమ్మగారు ఆహారాన్ని, మందుల్నీ దాదాపు నిషేధించారు ఆరునెలలు తిరగకుండానే ఆమె కూడా వెళ్ళిపోయారు" అన్నారు.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments